


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 80 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 31 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 80 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 31 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్
- కువైట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానం
- టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశం గుర్తింపు
- ప్రయాణికులంతా సురక్షితం, తనిఖీల్లో ఏమీ లభించలేదు
- ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు, విమాన ప్రయాణంపై అనిశ్చితి

- మిగతా 2లో...

### ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...

# 14న బడ్జెట్!

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను

ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.



## నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

- పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్న పవన్
- గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నాశనం చేసిందని విమర్శలు
- వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:"నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

- మిగతా 2లో...




## సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు అసహనం
- ప్రభుత్వం తీరుపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం
- పరిహారం ఎప్పుడు, ఎంత ఇస్తారో చెప్పాలంటూ ప్రశ్నలు
- కంపెనీతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ డైరెక్టర్లకు నోటీసులు

పెన్ పవర్ డెస్క్:సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో జాప్యం, స్పష్టత లేకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.గతేడాది సంగారెడ్డి

- మిగతా 2లో...

## పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

- గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం

- మిగతా 2లో...



### ప్రాణాలు తీసేందుకే లడ్డూల్లో విష రసాయనాలు..

## వైసీపీ మహాపాపం చేసింది

### టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



- హిందువుల ప్రాణాలతో చెలగాటమాడేందుకే ఈ కుట్ర అని సంచలన ఆరోపణ
- వైసీపీ హయాంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారయ్యాయని వెల్లడి
- రూ.250 కోట్ల అవినీతి జరిగిందని, నెయ్యిలో జంతు కొవ్వు కూడా ఉందని వ్యాఖ్య
- జగన్, వైసీపీ నేతలు హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

- మిగతా 2లో...

## తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

పెన్ పవర్ డెస్క్:తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై విచారణ చేసిన సీబీఐ.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.. తన నివేదికను వెల్లడించింది. సుదీర్ఘ విచారణ తర్వాత.. తిరుమల

- మిగతా 2లో...






## విశాఖలో చంద్రబాబు కుటుంబం భూదోపిడీకి తెరలేపింది

- జీవీఎంసీ ధర్నాచౌక్ వద్ద వైసీపీ నిరసనలు
- గీతం యూనివర్శిటీ భూదోపిడీని అరికట్టాలని నినాదాలు
- ప్రజల ఆస్తులను కాపాడటమే తమ లక్ష్యమన్న బొత్స

పెన్ పవర్ డెస్క్:విశాఖలోని గీతం యూనివర్సిటీ భూములపై వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. జీవీఎంసీ ధర్నాచౌక్ వద్ద శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ భూదోపిడీని అరికట్టాలని ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## ఏపీ- తెలంగాణ జల వివాదం.. ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ




పెన్ పవర్ డెస్క్:ఏపీ,తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారానికి సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఢిల్లీలో భేటీ అయ్యింది. ఈ సమావేశానికి కమిటీలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు కృష్ణా గోదావరి బోర్డుల చైర్మన్లు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ తరపున సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి , చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్, సూపరిడెంట్ ఇంజనీర్ గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామచంద్రరావు, కె, రమేష్ హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి

- మిగతా 2లో...

## కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

- ఎలాన్ మస్క్‌పై మరోసారి విరుచుకుపడ్డ వినోద్ ఖోస్లా
- జాతివివక్ష వ్యాఖ్యలు చేసి కుటుంబాన్ని అడ్డుపెట్టుకోవద్దని హితవు
- 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతిస్తున్నారని ఖోస్లా ఆరోపణ
- భారత సంతతి భాగస్వామి గురించి ప్రస్తావిస్తూ మస్క్ కౌంటర్
- ఇద్దరు టెక్ బిలియనీర్ల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం

- మిగతా 2లో...








## సీపీఆర్‌పై.. అవగాహన అవసరం!

నేటి సమాజంలో హార్ట్ అటాక్ అనేది వృద్ధులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది. వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ.. సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన అత్య వసర స్థితిలో ప్రాణాలను రక్షించే ప్రాథమిక వైద్య ప్రక్రియ కానీ దురదృష్టవశాత్తు, మన సమాజంలో సీపీఆర్‌పై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఎవరైనా కుప్పకూలినప్పుడు ప్రజలు సహాయం చేయకుండా భయంతో, అయోమయంలో నిలబడిపోతున్నారు. కొందరు వీడియోలు తీయడంలో నిమగ్నమవు తున్నారు. మరికొందరు 'ఏం చేయాలో తెలియదు' అంటూ విలువైన నిమిషాలను వృథా చేస్తున్నారు.. ఈ నిర్లక్ష్యమే అనేక ప్రాణ నష్టాలకు కారణమవుతోంది. హార్ట్ అటాక్ తర్వాత మొదటి ఒక గంటను వైద్యులు "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారు. ఈ కీలక సమయంలో సీపీఆర్ ప్రారంభమైతే, వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తే, బాధితుడు మళ్లీ సాధా రణ జీవితానికి చేరుకునే అవకాశముంది. కానీ అవగాహన లేనందున ఆ గోల్డెన్ అవర్ మన చేతుల మధ్యనే జారిపోతోంది. సీపీఆర్ అవసరం కేవలం హార్ట్ అటాక్‌లకే పరిమితం కాదు.. వైద్య నిపుణుల ప్రకారం, కరెంట్ షాక్ తగిలి వ్యక్తి స్పృహ కోల్పోయి శ్వాస ఆగిపోయిన పరిస్థితిలో, పరిసరాలు సురక్షితంగా ఉన్నట్లయితే సీపీఆర్ చేయవచ్చు.. అయితే ముందుగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం అత్యంత ముఖ్యం. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన స్టెప్స్. ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే ఈ విధంగా చేయాలి. స్పందన ఉందా లేదా చూడాలి. వ్యక్తిని పిలిచి, భుజాన్ని మెల్లగా కదిలించి స్పందిస్తున్నాడా చూడాలి. శ్వాస ఉందా లేదా పరిశీలించాలి. ఛాతీ కదులుతోందా శ్వాస వస్తోందా..? లేకపోతే వెంటనే చర్య తీసుకోవాలి. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి.. ఇది అత్యంత కీలకమైన దశ. ఛాతిపై ఒత్తిడి ఇవ్వాలి. బాధితుడిని సమానంగా ఉన్న నేలపై పడుకోబెట్టాలి. ఛాతి మధ్యభాగంపై రెండు చేతులు ఉంచి నిమిషానికి సుమారు 100–120 సార్లు 5–6 సెం.మీ లోతుగా ఒత్తిడి ఇస్తూ ఆపకుండా కొనసాగించాలి. శ్వాస ఇచ్చే పద్ధతి తెలిసి ఉంటే మాత్రమే ఇవ్వాలి.. తెలియని వారు కేవలం ఛాతి ఒత్తిడినే కొనసాగించినా సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత మరింత అవసరం. పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి సీపీఆర్‌పై విస్తృత అవగాహన కార్య క్రమాలు చేపట్టాలి.. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, బస్టాండ్‌లు, కార్యాలయాలు వంటి ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి. సీపీఆర్ అనేది డాక్టర్లకే కాదు, ప్రతి సాధారణ పౌరుడికీ తెలిసి ఉండాల్సిన మౌలిక జీవన నైపుణ్యంగా మారాలి. ఇది ఖర్చుతో కూడిన కార్యక్రమం కాదు. కానీ దీని వల్ల లభించే ఫలితం అమూల్యమైనది ఒక మనిషి ప్రాణం. ప్రభుత్వం మాత్రమే కాదు.. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అందరూ కలిసి సీపీఆర్ అవగాహనను ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సీపీఆర్ ఒక జీవన రక్షణ విద్య. ఇప్పుడు నేర్చుకోకపోతే తర్వాత పశ్చాత్తాపమే మిగులుతుంది.

## నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

- మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు.గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి–జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

**అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

**దాతృత్వానికి నిలువుటద్దం**

గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. 2.69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో మొత్తం 600 పడకలు ఉన్నాయి. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డాక్టర్ గవిని ఉమాదేవి (రూ.22 కోట్లు), నళిని–వెంకట్ తేళ్ల (రూ.8 కోట్లు) సహా పలువురు దాతలు భారీగా విరాళాలు అందించారు. నాట్కో ఫార్మా కూడా వివిధ అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసేందుకే లడ్డూల్లో విష రసాయనాలు.. వైసీపీ మహాపాపం చేసింది

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ప్రాణాంతక రసాయనాలు కలిపారని, హిందువుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు గత వైసీపీ ప్రభుత్వం పథకం ప్రకారమే ఈ కుట్రకు పాల్పడిందని టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయుడు) సంచలన ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన ఫైనల్ చార్జ్‌షీట్‌తో ఈ బండారం బట్టబయలైందని, ఇది స్లో పాయిజన్ ఇచ్చి హిందువులను హతమార్చే ప్రయత్నమేనని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేసి మహాపాపానికి ఒడిగట్టిన వైఎస్ జగన్, వైసీపీ నేతలు హిందూ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సిట్ నివేదికలో తమకు క్లీన్‌చిట్ వచ్చిందని వైసీపీ నేతలు సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. వాస్తవానికి, 2019 నుంచి 2024 మధ్య కాలంలో టీటీడీకి సరఫరా అయిన సుమారు 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ అని సిట్ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఈ రూ.250 కోట్ల విలువైన కల్తీ నెయ్యితో సుమారు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారని, కోట్ల మంది హిందువుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ అనే సంస్థకు కనీస పాల సేకరణ సామర్థ్యం లేకపోయినా, కేవలం ఒకరిద్దరికి లబ్ధి చేకూర్చేందుకే నిబంధనలు మార్చి కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు.

"చుక్క పాలు లేకుండా లక్షల కిలోల నెయ్యి ఎలా వస్తుంది? పామాయిల్, ప్రాణాంతక రసాయనాలు, జంతు కొవ్వు (టాలో) కలిపి సింథటిక్ నెయ్యి తయారు చేసి శ్రీవారి ప్రసాదంలో వాడారు. ఎన్‌డీడీబీ (ఛీణఐదీ) నివేదికతో పాటు సిట్ రిపోర్ట్‌లోనూ నెయ్యిలో జంతు కొవ్వు ఉన్నట్లు స్పష్టంగా ఉంది. ఇది హిందువులపై జరిగిన దాడి కాదా?" అని బీఆర్ నాయుడు ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని, అన్యమతస్థులు తిరుమల ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నించగా, గత పాలకులు వారికి సహకరించారని ఆరోపించారు.ఈ కేసులో గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు సీబీఐకి ఇవ్వడానికి నిరాకరించారని, కానీ ఆయన పీఏ చిన్నప్ప ఖాతాలోకి కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని నిలదీశారు. గత పాలకుల ఒత్తిళ్లకు సంబంధించిన ఈ–మెయిళ్లు కూడా సిట్ వద్ద ఆధారాలుగా ఉన్నాయని చెప్పారు. తిరుమలలో జరిగిన ఈ అపచారానికి వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని, తప్పులు చేసి ఇప్పుడు

యాగాలు చేస్తే పాపాలు పోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యిలోని రసాయనాలపై పూర్తి నిజాలు తేలేందుకు మైక్రో డీఎన్ఏ టెస్ట్ చేయించాలని సిట్‌ను, న్యాయస్థానాన్ని కోరతామని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ మహా కుంభకోణం వెలుగులోకి వచ్చిందని, టీటీడీ పవిత్రతను కాపాడే విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణికులతో సహా మొత్తం 186 మంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానం గాల్లో ఉండగా, ఓ టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. విమానాన్ని హైజాక్ చేస్తామని, బాంబు ఉందని ఆ నోట్‌లో ఉండటంతో పైలట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ భద్రతా నిబంధనల ప్రకారం, పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే, భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులందరినీ కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.డి. నకుమ్ మాట్లాడుతూ, "తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. విమానం తనిఖీ పూర్తయింది, తదుపరి విచారణ కొనసాగుతోంది" అని వివరించారు.అధికారులు ఈ చేతిరాత నోట్ ఎక్కడి నుంచి వచ్చింది, విమానంలోకి ఎలా చేరింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విమానం తిరిగి ఢిల్లీకి ఎప్పుడు బయలుదేరుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల అహ్మదాబాద్‌లో పలు చోట్ల బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ వట్టిదేనని తేలింది. అయినప్పటికీ, ప్రతి బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

- మొదటి పేజి తరువాయి

వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు లేదని.. జంతువుల నుంచి తీసిన కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని వెల్లడించింది సీబీఐ. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు ఉందని స్వయంగా సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటల తర్వాత.. కేసులు నమోదయ్యాయి. సీబీఐ విచారణకు జగన్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సీబీఐ విచారణ చేసింది. విచారణ తర్వాత.. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమలలో తయారు చేసిన లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని.. కల్తీ జరగలేదని.. స్పష్టం చేస్తూ సీబీఐ రిపోర్ట్ ఇచ్చింది.

శుక్రవారం ( జనవరి 23 ) ఫైనల్ చార్జిషీట్ సమర్పించింది సీబీఐ సిట్. తిరుమల లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యిలో కూరగాయల నూనెలు, కృత్రిమ పాల ఉత్పత్తులలో వాడే ఈస్టర్‌లు కలిపి కల్తీ చేశారని చార్జిషీట్ లో పేర్కొంది సిట్. నెయ్యిలో జంతువుల కొవ్వు జాడ లేదని స్పష్టం చేసింది సిట్. సిట్ సమర్పించిన ఫైనల్ చార్జిషీట్ పై స్పందించిన టీటీడీ మాజీ చైర్మెన్ భూమన కరుణాకర్ రెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఉద్దేశపూర్వకంగా హిందూ మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు.జగన్ ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఏకైక ఉద్దేశంతోనే తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతు కొవ్వు వాడారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో జగన్ ను కించపరచడమే కాకుండా.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రత, ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు.గత ఏడాదిన్నర కాలంగా.. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్లకు పైగా హిందువులు ఈ తప్పుడు ప్రచారంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని అన్నారు.ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో ఉన్న ప్రధాన సరఫరాదారు భోలే

బాబా ఆర్గానిక్ డెయిరీ "వర్చువల్" తయారీ యూనిట్‌గా పనిచేస్తుందని ఛార్జిషీట్ లో వెల్లడించింది సిట్. 2019 నుండి 2024 వరకు భోలేబాబా డెయిరీ నెయ్యి తయారీ కోసం పాలు, వెన్నను తీసుకోలేదని, అయినప్పటికీ టీటీడీకి కనీసం 68వేల కిలోల నెయ్యిని సరఫరా చేసిందని పేర్కొంది సిట్.ఫైనల్ ఛార్జిషీట్‌లో 36 మందిని నిందితులుగా పేర్కొంది సిట్, ఇందులో తొమ్మిది మంది టిటిడి అధికారులు, ఐదుగురు డైరీకి సంబంధించిన వ్యక్తులు, తదితరులు ఉన్నారు.

## సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది దుర్మరణం చెందగా, 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులకు పరిహారం అందించాలని, ఘటనపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. "పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎంత ఇస్తున్నారు? అసలు ఎప్పుడు ఇస్తారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.పరిహారం పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కంపెనీని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసులో ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాల వివరాలను సమర్పించాలని వారికి నోటీసులు జారీ చేసింది.

## కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

భారత సంతతికి చెందిన బిలియనీర్ ఇన్వెస్టర్ వినోద్ ఖోస్లా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. జాతి వివక్షాపూరిత వ్యాఖ్యలు చేస్తూ, తనను తాను సమర్థించుకోవడానికి కుటుంబాన్ని మధ్యలోకి లాగడంపై ఖోస్లా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మస్క్‌కు చురకలు అంటించారు. "ప్రపంచ జనాభాలో శ్వేతజాతీయులు వేగంగా అంతరించిపోతున్న మైనారిటీ" అంటూ మస్క్ గతంలో చేసిన ఓ పోస్ట్‌తో ఈ వివాదం మొదలైంది. దీనిపై స్పందించిన ఖోస్లా.. మస్క్ జాతి వివక్షను ప్రోత్సహిస్తున్నారని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్' (ఔూ+ూ)కు మద్దతిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ఖోస్లాను 'గర్విష్టి', 'రిటార్డ్' అంటూ దూషించారు. తన భాగస్వామి శివాన్ జిలిస్ సగం భారతీయురాలని, వారి కుమారుడికి భారత సంతతికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత చంద్రశేఖర్ పేరు పెట్టానని చెబుతూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఖోస్లా మరోసారి స్పందించారు. "మీ కుటుంబాన్ని ఇందులో కలపడానికి బదులు, మరోసారి జాతి వివక్షగా అనిపించే పోస్టులు పెట్టకుండా ప్రయత్నించండి. మీరు అమెరికాలో శ్వేతజాతి సమాజాన్ని స్థాపించడానికి ప్రయత్నించడం లేదని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతుదారు కాదని అంగీకరిస్తే చాలామంది అభినందిస్తారు" అని ఖోస్లా పేర్కొన్నారు.మస్క్ ప్రస్తావించిన బీచ్ వివాదంపై కూడా ఖోస్లా స్పందించారు. తన కాలిఫోర్నియా ఆస్తి సమీపంలోని బీచ్‌కు వెళ్లేందుకు ప్రైవేట్ ప్రాపర్టీ గుండా ప్రవేశించాలంటే రుసుము చెల్లించాల్సిందేనని అన్ని కోర్టులు తీర్పు ఇచ్చాయని గుర్తుచేశారు. "ప్రైవేట్ ఆస్తి హక్కు అనే సూత్రాన్ని కాపాడటానికి నేను నిలబడటాన్ని మీరు అభినందించాలి. ఇది కాకపోతే మిగతాదంతా కమ్యూనిజమే" అని వ్యాఖ్యానించారు.

## ఏపీ- తెలంగాణ జల వివాదం.. ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

- మొదటి పేజి తరువాయి

జనవరి 2 న ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. గోదావరి, కృష్ణాలో అందుబాటులో ఉన్న జలాలు నికర జలాలు, మిగులు జలాలు, ప్రాజెక్టులు సహా పల అంశాలపై వివాదాలను పరిష్కరించుకుని ఎలా ముందుకు వెళ్లాలని దానిపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు.

గతేడాది కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు వాటిని చర్చించి సాంకేతికంగా పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకే ఇవాళ భేటీ అయిన ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు అయ్యింది.

## విశాఖలో చంద్రబాబు కుటుంబం భూదోపిడీకి తెరలేపింది

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు తదితర నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ... చంద్రబాబు, ఆయన కుటుంబం విశాఖలో భూదోపిడీకి తెరలేపిందని అన్నారు. అధికారం ఉందని భూదోపిడీ చేస్తే పేద కుటుంబాల తరపున తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక పనులను తాము ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడటమే లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## జాతీయ కుష్టి వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సులు




**గంగవరం, పెన్ పవర్, జనవరి 30:**జాతీయ కుష్టి వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ నిహిత నేతృత్వంలో వైద్య సిబ్బంది చేపట్టారు.మండలంలోని నెల్లిపూడి, సూరంపాలెం, కొత్తాడ తదితర గ్రామాల్లో గల పాఠశాలలను సందర్శించిన వైద్య బృందం విద్యార్థులకు కుష్టి వ్యాధి లక్షణాలు, వ్యాప్తి విధానం, నివారణ చర్యలు మరియు చికిత్స అవకాశాలపై వివరంగా అవగాహన కల్పించారు. కుష్టి వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా చికిత్స పొందవచ్చని తెలిపారు.అలాగే వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాగమణి, లక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలు వాలి విధ్యుత్ సరఫరాకు అంతరాయం



**ఏలూరు జనవరి 30 పెన్‌పవర్ :** పెదవేగి మండలం భోగాపురం గ్రామంలో విధ్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా రహదారిపై విద్యుత్ పరివర్తకం పక్కన చెట్లు మొలచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పై వాలుతున్నాయి.సమీపంలోని రైతుల పొలాలకు వ్యవసాయ మోటార్లు వారి పోలాలకు నీటిని అందించేందుకు తరచూ అంతరాయానికి గురవుతన్నాయి. ట్రాన్స్ ఫార్మ్‌పై వాలిన చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చాడానికి గ్రమ రైతాంగం విద్యుత్ అధికారలను కోరుతోంది

# కడియం సబ్ రిజిస్టర్ కార్యాలయం లో ఏసీబీ దాడులు

### అనధికారికంగా ఉన్న రెండు లక్షలు రూపాయలు స్వాధీనం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**ఎంతోకాలంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం, కడియం మండలం కడియం గ్రామంలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు పెట్టింది పేరుగా మారింది. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా ప్రళయంలోనే నకిలీ దస్తావేజులు సృష్టించడం , అక్రమంగా స్థిరాస్తి లు క్రయ,విక్రయాలు జరగడం, నకిలీ పేర్లు మార్పులు, చనిపోయిన వారు బతికున్నట్లుగాను, బతికున్న వారు చనిపోయినట్లుగాను పేరు మార్పులు చేసి నకిలీ రిజిస్ట్రేషన్లు చేయడంలో ఈ కార్యాలయము వార్తలకు ఎక్కుతుంది. గత రెండేళ్లుగా ఈ కార్యాలయంలో అవినీతి అక్రమాలు, నకిలీ పేర్లతో క్రయ, విక్రయలు జరుగుతు కోట్లాది రూపాయల భూములు ,స్థలాలు రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరుగుతున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో సబర్ రిజిస్టర్ తో పాటు కార్యాలయం సిబ్బంది, దస్తావేజుల లేఖరూలు ఆ కీలక పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపనలపై సమాచారం అందుకున్న రాజమండ్రి డివిజన్ ఏసీబీ అధికారులు డిఎస్పి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం గురువారం రాత్రి కార్యలయాన్ని చుట్టుముట్టి దాడులు చేసింది. సబ్ రిజిస్టర్ గదిలో సుమారు 78 వేల రూపాయలు, సిబ్బంది సిబ్బంది గదిలో లక్ష ఇరవై వేల రూపాయలు అదే అదనంగా, ఆనాధికారకంగా ఉన్నట్లు ఏసీబీ తనిఖీ బృందం గుర్తించిందని ఏసీబీడిఎస్పి అశోక్ కుమార్ మీడియా కు తెలిపారు. ప్రస్తుత సబ్ రిజిస్టర్ లక్ష్మి పత్తిపాడు సామర్లకోట, పెద్దాపురం కాకినాడ తదితర ఏరియాలో గ్రేడ్ 2 సబ్ రిజిస్టర్ గా పనిచేసి , గ్రేడ్ వన్ సబ్ రిజిస్టర్ గా పదోన్నతపై కడియం లో 20 24 అక్టోబర్ నెలలో భాగ్యం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ఈ సంతన్సర కాలంలో ఆమె మీద, కార్యాలయం మీద ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయని, కార్యాలయం నుంచి సిబ్బంది ఫోన్లు అన్ని సీజ్ చేసామని, ఆ ఫోన్లో ని ఆర్థిక లావాదేవీలు ఫోన్ పే లను పరిశీలిస్తున్నామన్నారు. సందర్భంగా కడియం గ్రామానికి చెందిన దొడ్డ మణికంఠ అనే అనే వ్యక్తి డిఎస్పీని కలిసి తన పేరుపై ఉన్న ఆస్తిని గత సంవత్సరం నకిలీల పేరుతో వేరే ఒకరికి రిజిస్ట్రేషన్ చేసిన సంగతిని సబ్ రిజిస్టర్ శ్రీలక్ష్మి దృష్టికి తీసుకురాగా ఆమె పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు. అన్ని వివరాలు తనకు అందజేస్తే విచారణ జరుపుతానని ఆన్నారు.
కాగా శుక్రవారం సాయంత్రం వరకు ఈ తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి.

## కొండ ఎక్కలేక మొరాయించిన ఎంపీడీవో కారు



**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్,జనవరి 30:** గుర్తేడు మండలం కానీ వాడ పంచాయతీ కొండ వేజువాడ పి ఫోర్ ప్రోగ్రాం కి వెళ్లే అధికారులు కారు కొండ ఎక్కలేక మొరాయించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది.
పి ఫోర్ ప్రోగ్రాం లో భాగంగా అధికారులు శుక్రవారం వాహనంలో బయలుదేరగా కొండవేజు వాడ గ్రామానికి వెళ్లే మధ్యలో కొండ ఎక్కలేక ఎంపీడీవో వాహనం మురయించింది. వాహనం క్రిందికి దొర్లిపోకుండా సిబ్బంది రాళ్లను టైర్లకు అడ్డంగా పెట్టారు. ఎండాకాలంలోనే పరిస్థితి ఎలా ఉంటే వర్షాకాలంలో ఈ రహదారి పరిస్థితి ఎలాగో ఉంటుందో ఊహించుకోవచ్చు అని స్థానికులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గాట్ రోడ్లలో సిమెంట్ తో రహదారులు నిర్మించాలని ఆ గ్రామ గిరిజనులు అధికారుల విజ్ఞప్తి చేస్తున్నారు.

# చెత్త వేరు చేసే విధానంపై చట్టి గ్రామంలో ప్రజలకు విస్తృత అవగాహన



**చింతూరు పెన్ పవర్ జనవరి 30:**చట్టి గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం నివారణ, చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, పీసా కమిటీ సభ్యులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, హెల్త్ వర్కర్లు, స్థానిక వ్యాపారస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ అలీ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి డబ్బాల్లో వేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని తెలిపారు. సర్పంచ్ రవ్వ భద్రమ్మ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించి, ప్రతి కుటుంబం ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని మానుకుని వస్త్ర సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ రాముడు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల సహకారంతో చట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు.పీసా ఉపాధ్యక్షులు తుర్రం ముత్తయ్య చెత్త నిర్వహణపై అవగాహన కల్పించడం ద్వారా గ్రామంలో వ్యాధులు తగ్గుతాయని తెలిపారు. పీసా కార్యదర్శి పొడియం రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో చెత్త వేరు చేసే అలవాటు పెంచాలని సూచించారు. హెల్త్ వర్కర్లు పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రజలకు వివరించారు. ఆటో యూనియన్ సభ్యులు గ్రామంలో అవగాహన కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగిస్తామని తెలిపారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ బ్యాగుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రజలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తడి చెత్త, పొడి చెత్త కోసం ప్రత్యేక డబ్బాలను ఏర్పాటు చేసి ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరించారు. అలాగే ప్లాస్టిక్‌కు నో చెప్పండి అనే సందేశంతో పోస్టర్లు ప్రదర్శించారు. ప్రతి షాప్ కి చెత్త వేయడానికి డస్ట్ బిన్లు ఇచ్చారు. మొత్తంగా చట్టి గ్రామంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందింది. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచేందుకు అందరూ కలిసి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కొండ వేజువాడలో పి ఫోర్ ప్రోగ్రాం



**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, జనవరి 30 :** కానీవాడ పంచాయతీ పరిధిలో కొండవేజువాడ గ్రామంలో పీపుల్ కాన్సెప్ట్ లో మీటింగ్ శుక్రవారం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.
ఈ కార్యక్రమంలో పిల్లలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి అడ్డతీగల ఎంపీడీవో ప్రత్యేక అతిథిగా హాజరయ్యారని తెలిపారు. గ్రామంలో ఉన్న పిల్లలకు అడ్డతీగల ఎంపీడీవో కొత్త బట్టలు ఇవ్వడం జరిగిందని, అడ్డతీగల మండలం ఎం ఎల్ సి ఓ సురేష్ గ్రామంలో అన్ని కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారని తెలిపారు. ఎర్రం రెడ్డిపాలెం పంచాయతీ సెక్రెటరీ పిల్లలకు పెన్సిల్ లు,సబ్బులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## బొడ్డు కార్యాలయం ముందు లోకేష్ కు ఘనస్వాగతం..




- భారీగా హాజరైన తెలుగు తమ్ముళ్లు..
- పలు అర్జీలు స్వీకరించిన మంత్రి నారా లోకేష్..

**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 30:** తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ కి బూరుగుపూడి గేట్ వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు అర్జీలు స్వీకరించి పరిష్కారం చూపుతా అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి కి పుష్పగుచ్ఛాలు అందజేసి నినాదాలతో ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం, రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా వ్యవస్థ పటిష్టతపై మంత్రి ముఖ్యమైన అంశాలపై నాయకులతో చర్చించారు.
ఈ కార్యక్రమంలో కంటే కేశ్వర రావు, గంగిశెట్టి చంటిబాబు,మార్ని రాము,సూదిన గంగాధర్, పుప్పాల వెంకటరత్నం, కందుల బాబు రాయుడు,బత్తుల నాగేశ్వరరావు, దూది కాంతారావు, మార్ని బుజ్జి కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# హుకుంపేట, సాటిలైట్ సిటీలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



✸ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:** రూరల్ మండలం హుకుంపేట, సాటిలైట్ సిటీ ప్రాంతంలో సుమారు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.
శుక్రవారం హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణాలకు ధీటుగా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. రుడా నిధులు రూ.95 లక్షలతో రహదారి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిట్టలవాని చెరువు నుండి వినాయకుడి గుడి వరకు సి.సి. రోడ్డు నిర్మాణం రూ.18.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టగా, గొర్రెల రమణ ఇంటి నుండి రోహిత్ ఇంటి వరకు, పార్వతి ఇంటి నుండి వై. సీతారత్నం ఇంటి వరకు తదితర ప్రదేశాలలో సి.సి. రోడ్లు సి.సి. డ్రెయిన్ల నిర్మాణ పనులు రూ.49.00 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పనులను శుక్రవారం గోరంట్ల ప్రారంభించారు. సాటిలైట్ సిటీ లో ఏ, బి, సి, డి బ్లాకుల్లో అభివృద్ధి పనుల పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. హుకుంపేట పంచాయతీ పరిధిలో మసీదు, శ్మశాన వాటిక, డ్రైనేజ్ ఔట్‌లెట్లు లేకపోవడం వంటి సమస్యలపై ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.
పిట్టలవాని చెరువు కాటన్ కాలం నుంచి ఉన్న డ్రెయిన్ ఆక్రమణకు గురైందని, వరలక్ష్మీ కాలనీ నుంచి చెరుకూరి గార్డెన్ వరకు ఉన్న డ్రెయిన్ ఆవ కాలువలో పూడ్చివేత జరుగుతోందన్నారు. పుణ్యక్షేత్రం, సాటిలైట్ సిటీ నుంచి వచ్చే డ్రెయిన్ నీటిని ఆవ ఛానల్ ద్వారా మళ్లిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.జీవనోపాధి కోసం వలస వెళ్తున్న వృత్తి కుటుంబాలకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా నైపుణ్య శిక్షణ అందించాల్సి ఉందన్నారు. శానిటేషన్ సిబ్బంది నియామకాలు చేపట్టామని తెలిపారు. ఉపాధిహామీ నిధులు, 15వ ఆర్థిక సంఘ గ్రాంట్లు, రుడా నిధులు విడుదలైన వెంటనే సాటిలైట్ సిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. హై టెన్షన్ విద్యుత్ లైన్ కింద గృహాల సమస్యలకు శాశ్వత పరిష్కారానికి బాధ్యత తీసుకుంటానన్నారు. ఒరియా కుటుంబాలకు టిడ్కో గృహాలు మంజూరుకి కృషి చేస్తానని తెలిపారు. రూ.4900 కోట్ల టిడ్కో గృహాల అప్పును ప్రభుత్వం చెల్లించిందని, త్వరలోనే 6200 లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్శేటి ప్రసాద్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, బొప్పన శ్రీను, యలమాటి రామకృష్ణ, అల్లూరి నరసింహమూర్తి, కోటిపల్లి చంద్రశేఖర్, గారపాటి నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, హిరసింగ్, ఇమంది శివరామకృష్ణ, చామంద్రి నాని, వెంకట్రావు, రాము, సాయి, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, డి.ఈ రవికుమార్, ఏ.ఈ సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుబంద గ్రామానికి చెందిన బొరుసు సంధ్య కి ఎమ్మెల్సీ సోము సిఎంఆర్ ఎఫ్ చెక్ అందజేత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**రాజానగరం మండలం వెలుగుబంద గ్రామానికి చెందిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బొరుసు సంధ్య వెంకటేష్ కి శుక్రవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ, ఆరోగ్య శ్రీ వర్తించని ప్రజలకు, పేదలకు కొన్ని రోగాల చికిత్సలకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు . ఇప్పటికే అనేకమంది కూటమి ప్రభుత్వం లో లబ్ది పొందారని సోము వీర్రాజు తెలియచేసారు. సిఎంఆర్ ఎఫ్ చెక్ అందుకున్న కుటుంబం కూటమి ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమం లో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు ఆళ్ళ శివనాగరాజు, బోయిది దుర్గారావు, ప్రగడ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సక్రమమైన ఓటర్ జాబితాల రూపకల్పన లక్ష్యం

రాజకీయ పార్టీ ప్రతినిధులతో డి ఆర్వో టి సీతారామ మూర్తి సమీక్ష




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**సక్రమమైన, పారదర్శకమైన , తప్పులేని ఓటర్ జాబితాల ప్రధాన లక్ష్యంగా రూపకల్పన చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతా రామమూర్తి ఉన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతా రామమూర్తి అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సీఈఓ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర విశ్లేషణ(ఎస్ ఐ ఆర్), ఎలక్ట్రోరల్ మ్యాపింగ్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ జాబితాల సవరణ వంటి అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీల సహకారంతో సక్రమమైన ఓటర్ జాబితాలు సిద్ధం చేయడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని డీఆర్వో టి సీతారామ మూర్తి స్పష్టం చేశారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఎన్నికల యంత్రాంగం బాధ్యతన్నారు. ఓటర్ జాబితాను 01-07-2025 నాటికి ఉన్న ప్రస్తుత ఓటర్ జాబితాతో పోల్చి మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో స్వీయ నమోదు విధానాన్ని అనుసరించి 40 సంవత్సరాలు పైబడిన వారు స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. 40 సంవత్సరాల లోపు కుటుంబ సభ్యుల ఆధారంగా ఓటర్ల మ్యాపింగ్ విధానం ద్వారా చేర్చవచ్చని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 53.80 శాతం ఓటర్లను ఐ ఆర్ 2002తో విజయవంతంగా మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు.
పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1581 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 218 కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించి మొత్తం 1799 కేంద్రాలకు సీఈఓ ఆమోదం లభించిందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆమోదం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు.యువ ఓటర్ల నమోదు, ఓటర్ జాబితాల సవరణ, అభ్యంతరాల పరిష్కారం, బి ఎల్ ఏ ల నియామకం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని కోరారు. సక్రమమైన ఓటర్ జాబితాల ద్వారానే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు.
ఈ సమావేశంలో టీడీపీ -- మండల అధ్యక్షులు ఎం. శివ సత్య ప్రసాద్,, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున జె.టి. రామారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున టి. దేవదానం జనసేన పార్టీ తరపున పి. రామారావు , బహుజన్ సమాజ్ పార్టీ -- జిల్లా అధ్యక్షులు పి. విజయ కుమార్ కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి కార్యాలయంలో జనతా వారధి లో ప్రజా సమస్యల స్వీకరణ , పరిష్కారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**స్తానిక క్వారీ మార్కెట్ సమీపంలో గల బిజెపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జనతా వారిది కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యల పై వినతి పత్రాలు స్వీకరించారు . రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో నాలుగు ముఖ్య పట్టణాలైన తిరుపతి, విజయవాడ ,రాజమండ్రి, విశాఖపట్నంలో ప్రతి శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలను స్వీకరించడం వాటి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, అధికారులకు, ప్రజలకు మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు పింఛనులు, వైద్య సహాయం, స్థానిక ప్రజా అవసరాలకు సంబంధించిన సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుండి నిడదవోలు, రాజానగరం ల నుండి స్థానిక నాయకులు, ప్రజలు రావడం జరిగింది. రాజమండ్రిలో మోడల్ కాలనీలో వీధి దీపాల సమస్య, వెలుగు బంధలో మురుగు కాల్వల నిర్వహణ లోపం, కనుపూరు లో సిసి రోడ్లు, వాకతిప్పలో బ్రిడ్జ్ , డ్రైనేజీ సమస్యల పై వినతి పత్రాలు స్వీకరించారు. బిజెపి నాయకులు ఈ సమస్యల పై వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య లు పరిష్కరించడంతో సుదూరం నుంచి వచ్చిన బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, జనతా భారతి కన్వీనర్ కృష్ణంరాజు గారు, కో కన్వీనర్ బండి సత్యప్రసాద్, జిల్లా పదాధికారులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక 40వ డివిజన్‌లో రూ. 8 లక్షలతో డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జనవరి 30:** తమ కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 40వ డివిజన్ బోడపాటి వారి వీధిలో రూ. 8,00,000 లక్షలతో 450 మీటర్ల సీసీ డ్రైన్ నిర్మాణానికి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు నగరంలో సుమారు రూ. 300 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఆరోగ్యకరమైన నగరం కోసం పార్కులు అవసరమని, గ్రీనరీ పెంచి పొల్యూషన్ తగ్గించడం ద్వారా ఆక్సిజన్ లెవెల్స్‌ను మెరుగుపరుస్తామన్నారు. ఇన్నర్ రోడ్లు, డ్రైనేజ్‌లపై ప్రాధాన్యత ఇస్తూ, నిధులను సద్వినియోగం చేస్తున్నామని చెప్పారు. మెయిన్ రోడ్లతో కనెక్ట్ అయ్యే ఇన్నర్ రోడ్లు, డ్రెయిన్లపై దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం డివిజన్ లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు ఆయన వెంట ఉన్నారు.

# అసంఘటిత కార్మికులు, చిన్న కార్మికులకు రూ.3 వేల పెన్షన్ సౌకర్యం

✸ సహాయ కార్మిక కమీషనర్ వలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**భారత ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులు చిన్న వ్యాపారులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత, స్థిర ఆదాయం, కుటుంబ రక్షణ, జీవితం అందించాలనే లక్ష్యంతో జీవితాంతం రూ 3000 రూపాయలు పెన్షన్ కల్పిస్తుందని
జిల్లా సహాయ కార్మిక కమీషనర్ బి ఎస్ ఎమ్ వలి శుక్రవారం తెలిపారు. ప్రధాన్ మంత్రి శ్రమ యోగి మాన్-ధన్, ప్రధాన్ మంత్రి లఘు వ్యాపారి మాన్-ధన్ / అనే రెండు ప్రభుత్వ హామీ గల జాతీయ పెన్షన్ పథకాలను అమలు చేస్తోందని ఎమ్ వలి తెలిపారు. ఈ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులు 60 సంవత్సరాలు నిండిన తర్వాత జీవితాంతం ప్రతి నెలా రూ.3,000/- ప్రభుత్వ హామీతో పెన్షన్ పొందవచ్చుని, ఇది వృద్ధాప్యంలో నమ్మకమైన, సురక్షితమైన ఆదాయ వనరుగా నిలుస్తుందన్నారు.
అసంఘటిత రంగ కార్మికుల కోసం
వీధి వ్యాపారులు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కూలీలు, వ్యవసాయ కూలీలు, బీడి కార్మికులు, ఇటుక బట్టీ కార్మికులు, హ్యాండ్లూమ్ కార్మికులు, గృహ కార్మికులు, చేతివృత్తిదారులు తదితర అసంఘటిత రంగ కార్మికులు ఈ పథకానికి అర్హులన్నారు. 18 నుండి 40 సంవత్సరాల వయస్సు, నెలవారీ ఆదాయం రూ.15,000 లోపు ఉండాలనీ ఈ పి ఎఫ్, ఈ ఎస్ ఇ సి, ఎన్ పి ఎస్ సభ్యులు కాకూడదన్నారు.
వయస్సును బట్టి నెలకు రూ.55/- నుండి రూ.200/- వరకు మాత్రమే లబ్ధిదారుడు చెల్లించే చందాకు సమానంగా కేంద్ర ప్రభుత్వం కూడా చెల్లిస్తుందన్నారు. లబ్ధిదారుడు మరణించిన పక్షంలో భార్య, భర్తకు నెలకు రూ.1,500/- కుటుంబ పెన్షన్ అందించనున్నారు .భార్యాభర్తలు ఇద్దరూ అర్హులైతే నెలకు రూ.6,000/- ద్వంద్వ పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు. చిన్న వ్యాపారుల,
చిన్న దుకాణదారులు, చిల్లర వ్యాపారులు, హోటల్ యజమానులు, మిల్లుల యజమానులు, వర్క్‌షాప్ యజమానులు, కమిషన్ ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, స్వయం ఉపాధిదారులు ఈ పథకానికి అర్హులన్నారు. 18 నుండి 40 సంవత్సరాల వయస్సు, వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్ల లోపు ఉండాలని, ఆదాయపు పన్ను చెల్లించని వారు కావాలన్నారు. ఈ పథకంలో కూడా నెలకు రూ.55/- నుండి రూ.200/- వరకు మాత్రమే చందా చెల్లించాల్సి ఉంటుందనీ, సమాన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.
అర్హులైన వారు సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయం, సి ఎస్ సి,లేదా మీ-సేవా కేంద్రంలో ఆధార్ ఆధారితంగా సులభంగా నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. నమోదుకు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, మొబైల్ నంబర్, ఫోటో, నామినీ వివరాలు తెలపాలన్నారు. ఈ ప్రభుత్వ హామీ గల పెన్షన్ పథకాలను ఉపయోగించుకొని వృద్ధాప్యాన్ని భయం లేకుండా భరోసాగా మార్చుకోవాలని సహాయ కమిషనర్ వలి ప్రజలను కోరారు.

# రాజకీయ లబ్ధి కోసం తిరుమలేశును కూడా వదలని కూటమి ప్రభుత్వం

✸ మీడియా సమావేశం లో మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 30:**ప్రపంచ వ్యాప్తంగా కోట్ల హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తున్నదని, కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని రాజకీయాలలోకి లాగారని
వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు. వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ తన కార్యాలయం లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు.తొలుత జాతి పిత, మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భముగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పార్టీ శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్, లోకేష్ హిందూ ధర్మాన్ని, వారి మనోభావాలను దెబ్బతీసే విధముగా తప్పుడు కథనాలు, గత 18 నెలల నుండి దారుణంగా మాట్లాడుతూ,
సిట్ నివేదిక లో జంతువుల కొవ్వు కలవలేదని నిర్ధారణ చేశారని, కూటమి నిరసనలు, సోషల్ మీడియా కథనాలు ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేంద్ర కూటమి లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హేయమైన కార్యక్రమాలను హిందూ సమాజం, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ ఎస్ ఎస్ లు స్పందించకపోవడం శోచనీయమన్నారు.
అన్నవరం సత్యదేవుని ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు తిరుగుతున్న ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్ ముగ్గురూ కలసి తిరుమల స్వామి వారికి మొక్కి క్షమాపణలు చెప్పాలని, లేకపోతే ఆ దేవుడే తగిన శిక్ష విధిస్తారని భరత్ తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధముగా పాలన ఉందని విమర్శించారు.

## నారా లోకేష్ కి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బత్తుల..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 30:**కాకినాడ పర్యటన నిమిత్తం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి విమానాశ్రయంలో జనసేన పార్టీ రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అడ్డతీగల లో ఘనంగా మహాత్మాగాంధీవర్ధంతి...



**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి 30:** మండల కేంద్రమైన అడ్డతీగలస్థానిక గాంధీ సెంటర్లో రాష్ట్ర ఏ.పీ.సి.సి కాంగ్రెస్ కార్యదర్శి దంగేటి. సత్తిబాబు ఆధ్వర్యంలో, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దంగేటి.సత్తిబాబు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ యావత్ భారతావానికి ఆదర్శప్రాయుడు అని అన్నారు. వలసవాదుల చెర నుండి అఖండ భారతావనికి విముక్తి కలిగింది, ప్రపంచానికి నూతన పోరాట వరవడిని నేర్పిన మహోన్నతమైన వ్యక్తి మన జాతిపిత మహాత్మా గాంధీ అని ఆయన వర్ధంతి సందర్భంగా రెండు నిమిషం మౌనం పాటించారు. ఉపాధి హామీ చట్టంలో ఆ మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయం,బాధాకరం అని గంగేటి. సత్తిబాబు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే ఆ మహనీయుని పేరు పెట్టాలని దంగేటి డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఉపాధి హామీ పని ఎంతో మేలు చేసేదని, దీనిని నిలుపుదల చేయడం దారుణమని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని దంగేటి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు కాళ్ళ లక్ష్మణ్,ఎం. భాస్కర్, ఐ. రమణ పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం.

- గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించిన వడ్డి రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 30.** తాడేపల్లిగూడెం పట్టణం సవిత్రుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత, మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించే 'అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా చేసుకొని భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించడం కోసం చేసిన పోరాటానికి గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింస మార్గం భారతీయులకే కాదు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. వారి జీవితం మనకు ధైర్యం, సహనం, మానవత్వం నేర్పిన అమూల్యమైన పాఠమని, గాంధీ ఆదర్శాలను మన జీవితాల్లో ఆచరించడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసీపీ నాయకులు మాకరాజు సతీష్, పట్నాల గణపతి, బూడి ప్రసాద్, గుండుమోగుల బలుసులు రావు, తానేటి అజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మికుమారి,దంపతులకు ఘనంగా సన్మానం



- కూనవరం,వి.ఆర్.పురం ఐ.సి.డీ.ఎస్.ప్రాజెక్టు అధికారి మల్లిక
- వి.ఆర్.పురం,కూనవరం,మండలాల అంగన్వాడీ,వర్కర్లు,

**వి.ఆర్.పురం**

**పెన్.పవర్.జనవరి.30:** 2026.సంవత్సరం,నూతనసంవత్సరంకాలంలో జాతీయ స్థాయి అంగన్వాడీ అవార్డులకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఐదుగురు అంగన్వాడీ కార్యకర్తలను ఎంపిక చేయగా మండలంలోని ధర్మతాళ్ళగూడెం గిరిజన బిడ్డ లక్ష్మి కుమారి,ఒకరు వి.ఆర్.పురం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి కుమారి ఒకరిగా ఎంపిక కావడం గొప్పవిశేషం,ఈ అవార్డు అందుకొని మండలానికి తిరిగి వచ్చిన,లక్ష్మికుమారికు రేఖపల్లి మండల ప్రజా పరిషత్,సమావేశపు హాలో కూనవరం ఐ.సి.డీ.ఎస్.ప్రాజెక్ట్,అధికారి మల్లిక సమక్షంలో అంగన్వాడీ సిబ్బంది.లక్ష్మి కుమారి,దంపతులను ఘనంగా సన్మానించారు.గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు,చిన్నారులకు,ప్రీ,స్కూ ల్,పిల్లలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లక్ష్మికుమారి,తనదైన శైలిలో నిబద్ధతతో అమలు చేస్తూ గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నారు.అంగన్వాడీ కేంద్రానికి ప్రతి రోజు 22 మంది పిల్లలు హాజరవుతుండగా రిమోట్ లెర్నింగ్,మెసేజెస్,ద్వారా వచ్చేరోజువారి కార్యక్ర మాలను ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తూ పిల్ల ల బౌద్ధిక,శారీరక అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. పోషణాహారం పంపిణీ,ఆరోగ్య పర్యవేక్షణ,గర్భిణీలకు అవ గాహన కార్యక్రమాలు,ప్రీ–స్కూల్,విద్యను సమర్థంగా నిర్వ హించడమే ఆమెకు ఈఅవార్డు రావడానికి ప్రధాన కార ణంగా నిలిచాయి.ఈ అభినందన కార్యక్రమంలో సూపర్వైజర్లు,నాయోమిరాణి,పద్మావతి,వనజాక్షి,ప్రతమ్,సంస్థ కోఆర్డినేటర్ పవన్,కుమార్,కూనవరం,వి.ఆర్.పురం, మండలాల అంగన్వాడీ,వర్కర్లు,కార్యాలయ సిబ్బంది. పాల్గొని లక్ష్మికుమారి,నుఅభినందించారు.గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి అవార్డు వరకు పట్టుదలతో కృషి చేసి ఆమె ఎదగడం, వడ్డిగూడెం గ్రామానికి మంచిపేరు తీసుకురావడం,అంగ న్వాడీ కార్యకర్తల సేవలకు గుర్తింపు, పెద్ద ప్రోత్సాహకంగా నిలుస్తుందని,మండలప్రజలు గ్రామ స్థులు అభిప్రాయపడుతున్నారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 30**

తాడేపల్లిగూడెం...విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని మ్యాథ్స్ కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ గజేంద్ర పురోహిత్ సూచించారు. ఏపీ నిట్ లోని ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సెల్ ఆధ్వర్యంలో ఇన్ సైట్స్ ఎక్స్చేంజ్ అనే అంశంపై రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ గజేంద్ర పురోహిత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను మరొకరితో చర్చించటం ద్వారా కొత్త కొత్త ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని చెప్పారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహనను పెంచుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సెల్ ఫ్యాకల్టీ మెంటార్, ఆచార్యులు శ్రీ ఫణికృష్ణ కర్రి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి.



**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 30.** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్ కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం వచ్చిన ఆయనకు వెంకటరాజు ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు నియోజకవర్గ సమస్యలపై చర్చించుకున్నారు. పార్టీ స్థితిగతులపై ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ జేఎన్టీయూలో నూతనంగా నిర్మించిన పీజీ బాలుర వసతి గృహాన్ని . అనంతరం కాకినాడలో కోరమండల్ ఆసుపత్రి ని మంత్రి లోకేష్ ప్రారంభిస్తారు అన్నారు. తరువాత కాకినాడ రూరల్ నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించి పార్టీ పటిష్ఠతకు తీసుకోవలసిన చర్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు కు సన్నద్ధం కావడం వంటి విషయాలపై మాట్లాడతారన్నారు.

## పడిలేచిన కెరటం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ





- తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ చాలా బలంగా ఉంది.
- వడ్డి రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 30.**

తాడేపల్లిగూడెం పట్టణం సవిత్రు పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశంకు హాజరై కార్యక్రమం విజయవంతం చేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ చాలా బలంగా ఉంది అని నిన్న సమావేశం ద్వారా తేటతెల్లమైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని,. లా అండ్ ఆర్డర్ ని చక్కగా అదుపులో ఉంచిన ఘనత ఆయనకు ఉందని, ఆయన సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాంక్షన్ అయిన రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వంలో పూర్తి చేస్తున్నారన్నారు. బ్రహ్మానందరెడ్డి మార్కెట్ అమ్మకం అంటూ వస్తున్న వాదనలపై మండిపడ్డారు. అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. వ్యాపారస్తులు ఎవరు భయపడే పనిలేదన్నారు. వ్యక్తిగత విమర్శలకు మా దగ్గర చోటు లేదని,. తాడేపల్లిగూడెం అభివృద్ధికి మేము ఎల్లప్పుడూ సహకరిస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రజలకు ఇబ్బంది పడినా ఇక్కడ వైఎస్సార్ సీపీ ఖచ్చితంగా ఖండిస్తుందన్నారు. కొట్టు సత్యనారాయణ అయినా నేను అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేస్తాం తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు తూచా తప్పకుండా పాటించడమే మా పని స్పష్టం చేశారు. స్థానిక కార్యకర్తలు గౌరవం మాత్రమే కోరుకున్నారన్నారు. నేరుగా ఎవరైనా నాతో మాత్రమే మాట్లాడండని,. మీ సమస్యలు చెప్పండని కోరారు. నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్త కన్వీనర్ గానే భావించాలన్నారు. ప్రతీ కార్యకర్తను కలుస్తా అని, క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకుని కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుని అందరిని కలుపుకుని ముందుకు వెళతామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేవిధంగా పోరాటం చేస్తామన్నారు. పడిలేచిన కెరటం లాంటిది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని, మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం చేసిన చర్యలకు ప్రతిచర్య ఉంటుందన్నారు. ప్రభుత్వమే మద్యపానాన్ని ప్రోత్సహించడం, బెల్టుషాపులు ఏర్పాటు చేస్తూ ప్రజలను తాగుబోతులను చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే అభినందిస్తామని, ప్రజలను మోసం చేస్తే ఖచ్చితంగా ప్రతిఘటిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు డిజిటల్ కార్డులు, ఇన్సూరెన్స్ లు అందించే విధంగా జగన్మోహన్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ శేషులత, జడ్పిటిసి ఉప్పులూరి వరలక్ష్మి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గుండుమోగుల బలుసులు, మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, మాకరాజు సతీష్, రాజా త్రినాథ్, బండి నర్సి, కాకర్ల శ్రీనివాస్, పట్నాల గణపతి, బూడి దుర్గప్రసాద్, తానేటి అజయ్, చిన్నం సురేష్, వింజమూరి శ్రీనివాస్, గోకా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు

## మండలంలో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ. ఎంపీడీవో రాజ్ మనోహర్.

**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 30.** మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒకరోజు ముందుగానే జరుగుతుందని స్థానిక ఎంపీడీవో జి రాజ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఒకరోజు ముందుగానే అనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మండల వ్యాప్తంగా 89 మంది పింఛనుదారులు ఉన్నారని వారికి మూడు కోట్ల 84 లక్షల 68 వేల రూపాయలు పింఛన్ల రూపంలో రావడం జరిగింది అన్నారు. వాటిని 178 మంది పింఛన్లు పంపిణీ అధికారుల ద్వారా మండల వ్యాప్తంగా అర్హులైన వారందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

# ఆదిత్య యూనివర్సిటీ లో రహదారి భద్రత పై అవగాహన సదస్సు





**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 30**:గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో 37వ జాతీయ రహదారి "భద్రతా మాసోత్సవాలలో" భాగంగా బస్ డ్రైవర్లకు,క్లీనర్ లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీ నివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రో. వైస్ చాన్సలర్ డా ఎ. రమేష్, సి ఎ ఓ కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ
ఈ రోజు మన నినాదం "శిక్షణతో భద్రత – సాంకేతికత ద్వారా పరివర్తన". అని
శిక్షణతో భద్రత, ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే, పని ప్రదేశంలో అవగాహన ముఖ్యం అని అన్నారు.శిక్షణ పొందిన వ్యక్తి ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించగలడు అని రోడ్డు భద్రత నుండి పారిశ్రామిక భద్రత వరకు, సరైన అవగాహన మరియు శిక్షణ ప్రాణాలను రక్షిస్తాయి అని
సాంకేతికత ద్వారా పరివర్తన సాంకేతికత మన పని విధానాన్ని మార్చింది అని ఆధునిక పరికరాలు, డిజిటల్ మానిటరింగ్ మరియు ఆటోమేషన్ ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు. యంత్రాలలో సాంకేతిక లోపాలను, మనుషుల కంటే వేగంగా ఈ పరికరాలు పసిగట్టగలవు.
పరివర్తన: శిక్షణ మరియు సాంకేతికత కలిసినప్పుడు, పని ప్రదేశాలలో భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయి.కావున ప్రతి ఒక్కరూ శిక్షణ పొంది రోడ్ భద్రతా నియమాలు అనుసరించాలని ఇది కేవలం ప్రమాదాల నివారణే కాదు, పనిలో సామర్థ్యాన్ని మరియు నాణ్యతను పెంచుతుంది అని అన్నారు. ఈ సమావేశంలో డా. విజయ్ కుమార్ రెడ్డి, ఎం.సూర్యనారాయణ, ట్రాన్స్పోర్ట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## కంకర పరిచారు.. తారు వేయడం మరిచారు..



**సీతానగరం, పెన్ పవర్, జనవరి :30**:సీతానగరం మండలంలోని ఏటి గట్టు వైపుకు వెళ్ళే ప్రధాన రహదారి సూమారు నాలుగు కిలోమీటర్ల వరకు కంకర వేసిన గుత్తేదారులు అధికారులు తారు వేయడం మరిచారు. ఈ ప్రధాన రహదారిలో నిత్యం వాహనాలు తిరుగుతూ రద్దీగా ఉంటుంది ఒకవైపు కంకరతో రోడ్డు ప్రమాదాలు మరోవైపు ఎండ దుమ్ముతో ప్రయాణం నరకయాతనగా ఉందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నామని వాహనదారులు గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవ చూపి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై చర్యలు తీసుకొని తారు వేసేలా చూడాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కొత్తాడ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర




### సేవలు మెరుగుపరచాలని సూచనలు

**గంగవరం, పెన్ పవర్ జనవరి 30**:గంగవరం మండలం కొత్తాడ గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో,ఇన్‌చార్జ్ ఎంపీడీవో గోపన్న దొర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న ప్రజా సేవల అమలు విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు, దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆయన సూచించారు.సచివాలయంలో నమోదయ్యే ఫిర్యాదులు, అభ్యర్థనలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఆదేశించారు. రికార్డులను సమగ్రంగా నిర్వహిస్తూ, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.గ్రామ ప్రజలకు అందే సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, అర్హులందరికీ ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ సేవల నాణ్యత పెంపుకు ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సకాలంలో లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు .ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



**ఏలూరు జనవరి 30 పెన్‌పవర్ :** పెదపాడు మండలం వట్లూరు పారిశ్రామిక శిక్షణా సంస్థ నుండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారి ప్రక్కన విద్యుత్ స్థంబానికి అమర్చిన ఫ్యూజ్ బాక్స్ కేరియర్ బాక్స్ చేతికందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉంది.ఫ్యూజ్ కెరియర్ బాక్స్ అమర్చిన స్థంభం వెనుకకు వాలిపోయి స్థానికులు,వాహనదారులు,పాదచారులు,విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సంభందిత విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నాణ్యతకు తిలోధకాలు

✹ వసతిగృహాల ఆధునీకీకరణ పనుల్లో కొరవడిన పర్యవేక్షణ




**ఏలూరు జనవరి 30 పెన్‌పవర్ :** విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో స్దానిక కోటదిబ్బలో నిర్వహిస్తున్న బాలుర,బాలికల వసతిగృహల ఆధునీకీకరణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేమితో నాణ్యత కొరవడి,పనులు నాసిరకంగా జరుగుతున్నాయి అనే ఆరోపణలు వెలువడ్డాయి.ఈ విషయమై వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గారావును వివరణ కోరగా తమ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు హస్టళ్ల ఆధునీకీకరణకు రూ.18 లక్షల అంచనాలతో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు.ఈ మేరకు రూ.13 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఈ నిధులలో రూ.7లక్షలతో బాలికల హాస్టల్‌మరుగుదొడ్లు,ఫ్లోరింగ్,తాగునీటి ట్యాంకుల ఏర్పాటు వంటి పనులు ఉన్నాయని వివరించారు.బాలికలహస్టలలో 46మంది విద్యార్థినులు ఉన్నారని, వీరిలో డిగ్రీ విద్యార్థినులు 4గురు,ఇంటర్ 35మంది,మిగిలిన 7 మంది పాఠశాల విద్యార్దులు ఉన్నారని హస్టల్ వార్డెన్ జ్యోతి తెలిపారు.వసతి గృహాల ఆధునీకీకరణ పనసులను ఎపిహెచ్‌ఎం ఐడిసి విభాగం నిర్వహిస్తుందని తెలిపారు.పనుల నాణ్యత విషయమై జె ఇ భవానీ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా గుత్తే దారుతో పనులు పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు.ఇంకా కొన్ని పనులు మిగిలిఉన్నాయని,వాటిని కూడా త్వరలో పూర్తిచేస్తామన్నారు.

## గంగవరం సచివాలయంలో మహాత్మా గాంధీకి ఘన నివాళి



**గంగవరం, పెన్ పవర్ జనవరి 30:**గంగవరం గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మహాత్మా గాంధీ కి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పండా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు గాంధీజీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అహింసా మార్గం, సత్యం, సమానత్వం వంటి విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. యువత గాంధీజీ ఆశయాలను తెలుసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే మండలంలోని పలు పాఠశాలలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా మహాత్మా గాంధీ జీవిత చరిత్రను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు .ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన తెలుగు తమ్ముళ్లకు బొడ్డు క్యాప్ ..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 30:** విద్య ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన తెలుగు తమ్ముళ్లకు తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి క్యాప్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో కందుల బాబు రాయుడు, సోడసాని త్రిమూర్తులు, మాత ప్రభు, మండల అధ్యక్షులు దూది కాంతారావు, తదితరులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తాం - ఎమ్మెల్యే బొలిశెట్టి.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 30.** నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, ఇల్లులేని వారందరికీ ఇళ్ళు నిర్మించి ఇస్తామని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి గురించి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండాచూస్తామని తెలిపారు. గోదావరి జలాలు కాలుష్యం కాకుండా ప్రజలందరూ బాధ్యత వహించాలని అన్నారు. పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. తిరుపతి ప్రసాదంలోకల్తీ జరిగిందని సీట్ నివేదిక ఇచ్చినప్పటికీ వైసీపీ నేతలు బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని, వివిధ విభాగాలకు చెందిన అధికారులందరూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు.
ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, మున్సిపల్ కమిషనర్ యేసుబాబు, ఎమ్మార్వో సునీల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు కి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జనవరి 30**; గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు, మౌలిక సదుపాయాలు ఎంతో కీలకమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం వంకా వారి గూడెం నుండి జీలుగుమిల్లి వరకు ఒక కోటి 50 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జిలుగుమిల్లి సొసైటీ చైర్పర్సన్ సరిపల్లి సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు పసుపులేటి ప్రసాదు, తమ్మన సాంబ, దుర్గారావు, అధికారులు పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు. శాప్ డైరెక్టర్ జగదీశ్వరి.



**పోలవరం, పెన్ పవర్, జనవరి 30.** క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. పోలవరం మండలం చీడూరు గ్రామానికి చెందిన యువతకు వాలీబాల్ కిట్ ను జగదీశ్వరి శుక్రవారం అందజేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మారుమూల గ్రామాల్లోని యువత క్రీడలపై దృష్టి పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది అనే విషయాన్ని గుర్తు చేశారు. వివిధ క్రీడల్లో రాణించిన ఎంతోమంది యువకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తూ ఉండడం అభినందనీయం అన్నారు. ఆటలు ఆడడం వల్ల శారీరక మానసిక ఉల్లాసం గా ఉంటారన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయని వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు తమకు ఇష్టమైన ఆడ కలిగిన ఆటలను తప్పనిసరిగా ఆడాలన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. స్వతంత్ర పోరాటంలో గాంధీజీ కృషిని వివరించారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## మురుగుతో సహజీవనం..రోగాలతో సతమతం

-గృహాలు-600 జనాభా: 2700



**ఏలూరు జనవరి 30 పెన్‌పవర్ :** గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెదవేగి మండలం గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామంలో మౌళిక సదుపాయాలు కల్పినలోనూ ,ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు ఎక్కడ వేసిన గంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణాలు పూర్తి కాక,చేసిన పనులకు బిల్లులు చెల్లించడంలోనూ జాప్యం కారణంగా గ్రామంలో అభివృద్ధి ప్రగతి వెనుకబడింది. భోగాపురం గ్రామంలో మురుగు, దుర్గంధంతో ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు.గ్రామంలో కాలువలు నిర్మాణం లేక ఈ దుస్దితి నెలకొంది.ప్రధాన వీధులలో ఇరువైపులా ప్రజల గృహాల ముందు భాగంలో గత ప్రభుత్వం హయాంలో పక్కా డ్రైనేజీలు నిర్మాణం చేపట్టక పోవడంతో ఇళ్ల ముందు కచ్చాడ్రైయిన్‌లలో మురుగు పారక ఇళ్ల ముందు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుడంతో ప్రజలు ముఖ్యంగా పిల్లలు,వృద్దులు,మహిళలు రోగాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత గ్రామంలో మచ్నిళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్దంచేశారు.గ్రామంలో మౌళిక వసతులకు ప్రాధాన్యత నిచ్చి గ్రామాన్ని అభివృద్ది పథంలోకి తీసుకు వస్తారని గ్రామస్దులు ఆశిస్తున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పార్టీకి భారంగా మారుతున్న వ్యక్తిగత తప్పులు

**కడప, జనవరి 30, పెన్ పవర్:** ప్రజా జీవితంలో ఉన్నవారు ప్రతి అడుగూ ఎంతో జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తన కూడా ప్రజల పరిశీలనలోనే ఉంటుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒక చిన్న తప్పు కూడా పెద్ద దుమారంగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ వాస్తవాన్ని విస్మరిస్తే రాజకీయ జీవితం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం ఇదే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది.సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం చిన్న విషయం కాదు. అలాంటి ఎదుగుదలతో పాటు హుందాతనం, బాధ్యత కూడా పెరగాలి. కానీ ఆ స్థాయికి తగిన ప్రవర్తన లేకపోతే అవకాశాలే శాపంగా మారుతాయి. అరవ శ్రీధర్ విషయంలో రాజకీయంగా వచ్చిన అవకాశాన్ని ఆయన సరిగా వినియోగించుకోలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చర్యల వల్ల ఆయనకు అవకాశం ఇచ్చిన పార్టీ కూడా ఇప్పుడు వివాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై వచ్చిన వేధింపుల ఆరోపణలు, వాటికి సంబంధించిన వీడియోలు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ చర్చకు దారితీశాయి. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి మరింత సంయమనం పాటించాల్సి ఉంటుందన్న విషయం ఇలాంటి ఘటనలతో మరోసారి గుర్తుకు వస్తోంది. సమాజం మొత్తం తన వైపే చూస్తుందన్న భావన ఉంటేనే వ్యక్తి తన ప్రవర్తనను అదుపులో ఉంచుకుంటాడు.ఇలాంటి ఘటనలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు, రాజకీయ పార్టీల ప్రతిష్ఠను కూడా ప్రభావితం చేస్తాయి. జనసేన విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, నైతికత గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారు. అలాంటి పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికరమే. ఇదే సమయంలో ప్రతిపక్షాలు దీనిని రాజకీయంగా ఉపయోగించుకోవడం సహజమే.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ గతంలో పలువురు నేతలపై ఆరోపణలు వచ్చాయి. అయితే వాటిపై పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పెద్దగా స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో పట్టించుకోని అంశాలే ఆ పార్టీకి నష్టం చేశాయన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అదే విషయాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం రాజకీయాల్లో సాధారణమే అయినా, ప్రజలు అన్నింటినీ గమనిస్తూనే ఉంటారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన వంటి పార్టీలు నైతికత గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాయి. అందుకే చిన్న తప్పు జరిగినా పెద్ద ప్రభావం పడుతోంది. అధికారంలో ఉన్నవారికి ప్రతి చర్య భూతద్దంలో కనిపిస్తుంది. అందువల్ల నాయకులు అడుగు తీసే ముందు అడుగు అత్యంత ఆలోచనతో వేయాల్సి ఉంటుంది. ఆరోపణలు వచ్చిన వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఆలస్యం చేస్తే పార్టీ క్రెడిబిలిటీ దెబ్బతింటుంది. అరవ శ్రీధర్ విషయంలో జనసేన నాయకత్వం అంతర్గత కమిటీ వేయడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరైన దిశలో వేస్తున్న అడుగుగా భావిస్తున్నారు. అయితే ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అమిత్ షాతో పవన్ చర్చలు



**విజయవాడ, జనవరి 30, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా రోజుల తర్వాత ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సారి ఆయన హస్తిన పర్యటనలో ప్రత్యేకత ఉంది. చాలా రోజుల తర్వాత ఢిల్లీ వెళ్లిన పవన్ కళ్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలసి పిఠాపురం రైల్వే స్టేషన్ వంటి అభివృద్ధి పనులపై చర్చించినప్పటికీ, ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు పవన్ కళ్యాణ్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినప్పటికీ ఆయన వెంట మంత్రి నాదెండ్ల మనోహర్ ఉండేవారు. కానీ ఈసారి మాత్రం ఒంటరిగానే పవన్ హస్తిన పర్యటన రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.2019 ఎన్నికల్లో జనసేన ఓటమి తర్వాత పవన్ కళ్యాణ్ అనేక సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పొత్తుల విషయంలోనూ, మరొక సమయంలోనూ ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యేవారు. ఆయన వెంట ఖచ్చితంగా నాదెండ్ల మనోహర్ ఉండేవారు. ఈసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ సమయంలో నాదెండ్ల మనోహర్ లేకపోవడం ఒక రకంగా చర్చించాల్సిన అంశమేనంటున్నారు. అయితే అదే రోజు మంత్రి వర్గ సమావేశం ఉండటంతో నాదెండ్ల మనోహర్ ను తీసుకోకుండా ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అక్కడ జనసేన కు చెందిన ఇద్దరు ఎంపీలు ఉండటం వల్లనే ఆయన పర్యటనలోనాదెండ్ల లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.మరొకవైపు పవన్ కళ్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అయితే రాజకీయ పరమైన అంశాలు ఎక్కువగానే వీరి మధ్య చర్చకు వచ్చినట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా కూటమి బలోపేతంపై చర్చించడంతో పాటు నియోజకవర్గాల పెంపుదలపై కూడా వీరి మధ్య చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఈసారి పొత్తుల విషయంలో ఎక్కువ స్థానాలు తీసుకునేలా బీజేపీ, జనసేనలు వ్యవహరించనున్నాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్, అమిత్ షాల భేటీ ఏపీ రాజకీయాల్లో మరొకసారి వేడెక్కింది.

**రెండు జిరాఫీల దత్తత**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన మాతృమూర్తి అంజనా దేవి జన్మదినం సందర్భంగా ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును గురువారం సందర్శించిన ఆయన, అక్కడి రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.జిరాఫీల దత్తత: జూలో ఉన్న రెండు జిరాఫీల సంరక్షణ బాధ్యతలను స్వీకరించిన పవన్ కళ్యాణ్, వాటికి సంబంధించి ఏడాది పొడవునా అయ్యే ఆహార, ఇతర నిర్వహణ ఖర్చులను తానే స్వయంగా భరిస్తానని వెల్లడించారు. ఈ మేరకు దత్తత పత్రాలను జూ అధికారులకు అందజేశారు.జంతువులతో సందడి: జూ పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ అక్కడి ఏనుగులు, జిరాఫీలకు స్వయంగా ఆహారాన్ని తినిపించారు. వన్యప్రాణుల పట్ల ఆయనకున్న మక్కువను చూసి జూ సిబ్బంది, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.కొత్త ఎన్‌క్లోజర్ ప్రారంభం: వన్యప్రాణుల సౌకర్యార్థం జూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారుజంతువుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వన్యప్రాణులను దత్తత తీసుకుంటే జూ పార్కుల అభివృద్ధి సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

అమ్మ పుట్టినరోజున ఆడంబరాలకు వెళ్లకుండా ఇలా మూగజీవాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పవన్ కళ్యాణ్ సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు.

## పవన్ ఎందుకు మౌనం

**కడప, జనవరి 30, పెన్ పవర్:** ఇటీవల జరిగిన విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడం రాజకీయ వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. వివిధ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా మీడియా ముందుకు వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం చాలా బాధాకరమని, ఇది దేశానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ముఖంలో ఆ సమయంలో స్పష్టమైన విషాదం కనిపించిందిఅయితే అదే సమయంలో మీడియా ప్రతినిధులు జనసేనకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించారు. కానీ పవన్ కళ్యాణ్ ఆ అంశంపై స్పందించకుండా అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా హైలైట్ చేస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు జనసేన కార్యకర్తలు మాత్రం తమ నాయకుడు నిజంగా బాధలో ఉన్నారని, ఆ పరిస్థితిలో ఇతర అంశాలపై మాట్లాడకపోవడం సహజమేనని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీసింది.రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంశంలో జనసేన నాయకత్వం తీసుకున్న వైఖరిపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కోనేటి ఆదిమూలంపై ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్నారు. మరికొందరి విషయంలో విచారణ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే జనసేన ఎమ్మెల్యే విషయంలో మాత్రం వివాదం చాలా రోజులుగా కొనసాగుతున్నా, పార్టీ స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమస్యను మౌనంగా ఎదుర్కోవడం, దిద్దుబాటు చర్యలు ఆలస్యం కావడం వల్ల పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ విలువలు, నైతికత, మంచి పాలన గురించి మాట్లాడుతుంటారు. కానీ అదే సమయంలో జనసేన నేతలపై కూడా లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు రావడం ఆయన లక్ష్యాలకు విరుద్ధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మంచి పాలన అందించాలన్న పవన్ కళ్యాణ్ ఆశయాన్ని కిందిస్థాయిలో కొందరు నేతల వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయనే భావన ఉంది. ఈ పరిస్థితి ఆయనను వ్యక్తిగతంగా కూడా కలచివేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీ స్థాయిలో స్పష్టమైన విధానం, వేగవంతమైన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే జనసేన ప్రజల్లో పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోగలదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# విబి జి రామ్ జితో భారత్ వికసించేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. అయితే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తి కాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరుప్రతిష్ఠలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. 2005 లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేక మార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఎంజిఎన్ఎఆర్ఇజిఎ చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ) నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి (పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2025 లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్ఎఆర్ఇజిఎ 2005 చట్టం తూచా తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ విబి జి రామ్ జి 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంత వరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది. నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి 2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10% వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100%, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90%, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా 10శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజుల పాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బ తింటుంది. ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గడమే కాక వికేంద్రీకరణ ఆదర్శం దెబ్బతిని రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించే ప్రమాదముంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తుల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంత మేరకైనా సఫలీకృతమై సామాజిక, ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం, అవినీతిలను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

# ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

**విశాఖపట్టణం, జనవరి 30, పెన్ పవర్:**

విశాఖలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లు వాడలో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసి త్వరలో గూగుల్ సంస్థకు అప్పగించనున్నారు. దాదాపు రైతుల భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. సింహాచలం భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. బెంగళూరుకు చెందిన ఆర్ఎం జెడ్ కార్పొరేషన్ విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఆ సంస్థ శంకుస్థాపనకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరిలోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు..ఆసియాలోని అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. కొద్ది నెలల కిందట ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం చేసుకుంది. అప్పటినుంచి రంగంలోకి దిగింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా భూముల సేకరణకు సంబంధించి వేగవంతం చేసింది. ఆనందపురం మండలం తర్లువాడ పరిసరాల్లో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. త్వరలో ఏపీఐఐసీ ద్వారా గూగుల్ కు ఆ భూములను అప్పగించునుంది. 51 మంది రైతుల నుంచి సేకరించిన భూములకు గాను 49 మంది రైతుల ఖాతాల్లో పరిహారానికి గాను డబ్బులు జమ చేశారు. మిగతా ఇద్దరు రైతులకు కూడా జమ చేస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ తెలిపారు.అయితే ఈ గూగుల్ డేటా సెంటర్కు నీరు చాలా అవసరం. జీవీఎంసీద్వారా నీటిని అందించే పనులపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు సింహాచలం భూముల కేటాయింపులకు సంబంధించి ఫైల్స్ ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తయితే డేటా సెంటర్ ఏర్పాటుకు కీలక అడుగు పడినట్టే. మరోవైపు ఫిబ్రవరిలోనే డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ =ఫ్గీ సంస్థతో ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు లక్ష కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనుంది సదరు సంస్థ. ఈ నేపథ్యంలో =ఫ్గీ ప్రతినిధులు విశాఖ తో పాటు విజయనగరంలో పర్యటించారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు.

# అమరావతిలో మొదటి క్యాష్‌లెస్ టోల్ ప్లాజా



**విజయవాడ, జనవరి 30, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలి టోల్‌గేట్ రెడీ అయింది. ఏపీ సచివాలయంకు వెళ్లే దారిలో వెంకటపాలెం గ్రామం వద్ద కొత్తగా నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌పై టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే మొట్టమొదటి క్యాష్ లెస్ టోల్ ప్లాజా అని ప్రచారంలో ఉంది. కేవలం డిజిటల్ పేమెంట్స్ లేదా ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే ఇక్కడ టోల్ ఫీజ్ వసూలు చేస్తారు. త్వరలోనే ఈ పద్ధతిని దేశంలోని అన్ని టోల్ ప్లాజాలలోనూ అమలు చేయబోతున్నారు. ప్రస్తుతానికి ఈ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు ట్రాఫిక్ పూర్తి స్థాయిలో మరోవైపు ట్రాఫిక్‌ను పాక్షికంగానూ వదులుతున్నారు. రెండు వైపులా బైపాస్ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక అంటే మార్చి నెల టైమ్‌కి ఈ టోల్ ప్లాజాను మొదలు పెట్టనున్నట్టు తెలుస్తోంది.రాష్ట్ర విభజన, అమరావతిలో రాజధాని ప్రకటన తరువాత విజయవాడ నగరం పైనుంచి వెళ్లే ట్రాఫిక్ విపరీతంగా పెగిరి పోయింది. దీన్ని డైవర్ట్ చేయడం కోసం చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల కోసం కాజా టోల్ ప్లాజా దగ్గర నుంచి రాజధాని గ్రామాల మీదుగా గొల్లపూడి వరకూ 17.8 కిలోమీటర్లు కొత్త బైపాస్ వేశారు.

అక్కడి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు వేరే మార్గంలో వెళ్ళిపోతాయి. అలాకాకుండా వైజాగ్ వైపు వెళ్లే వాహనాల కోసం అదే బైపాస్ మరో 30కిమీ వెళ్లి చిన్న అవుట్ పల్లి (గన్నవరం ఎయిర్ పోర్ట్ ) వద్ద హౌరా హైవేతో కలుస్తాయి. సో విజయవాడ సిటీలోకి వెళ్లే అవసరం లేకుండా మొత్తం 47.8 కిమీ బైపాస్ నిర్మించారు. దీన్నే విజయవాడ వెస్ట్ బైపాస్ అని పిలుస్తున్నారు. ఇది నేషనల్ హైవే 16 (చీఎ 16)లో భాగం. దీని వల్ల అనవసర ట్రాఫిక్ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా గమ్యస్థానాలకు వెళ్లేందుకు దూర ప్రాంత వాహన దారులకు ప్రయాణం ఈజీ అవుతోంది. ఈ హైవే మధ్యలో కృష్ణా నదిపై నిర్మించిన 3.1కిమీ ల బాహుబలి బ్రిడ్జ్ ఒక స్పెషల్ ఎట్రాక్షన్.విజయవాడ వెస్ట్ బైపాస్ మొత్తాన్ని అధునాతన టెక్నాలజీతో నిర్మించినట్టు హైవే అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ త్వరలోనే అసలు టోల్ ప్లాజాలే అవసరం లేకుండా ప్రయాణించిన దూరాన్ని బట్టి అమౌంట్ కట్ అయ్యేలా కొత్త విధానం తెస్తామని ప్రకటించారు. దీనవల్ల టోల్ గేట్‌ల వద్ద ఏర్పడే ట్రాఫిక్ కష్టాలు అస్సలుండవు అనేది వారి ఆలోచన. ఒకవేళ ఆ పద్ధతే అమల్లోకి తెస్తే అప్పుడు ఈ వెంకటపాలెం టోల్ ప్లాజా ఏమౌతుందని మరో చర్చ అది మొదలవక ముందే జనాల్లో నడుస్తోంది. ఏదేమైనా అమరావతి రాజధాని ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీ విపరీతంగా పెంచే ప్రయత్నం చేస్తున్న కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల పనిలో భాగంగా అమరావతి లో ఏర్పాటైన తొలి టోల్ ప్లాజా గా వెంకటపాలెం టోల్ గేట్ వార్తలకెక్కింది.

## వరల్డ్ కప్‌కు మ్యాచ్ అధికారులని ప్రకటించిన ఐసీసీ.. లిస్ట్‌లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంపైర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20వరల్డ్ కప్ 2026కు ఐసీసీ మ్యాచ్ అధికారులను ప్రకటించింది. ఫిబ్రవరి 7 నుంచి ఇండియా, శ్రీలంక సంయక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ గ్రూప్ దశలకు శుక్రవారం (జనవరి 30) మ్యాచ్ అధికారులను ఎంపిక చేసింది. ఈ లిస్ట్ లో ఇండియాతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్ అంపైర్లు కూడా ఉన్నారు. లీగ్ మ్యాచ్ లకు మొత్తం ఆరుగురు మ్యాచ్ రిఫరీలతో పాటు మొత్తం 24 మంది అంపైర్ల జాబితా లిస్ట్ వచ్చేసింది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్– నెదర్లాండ్ మధ్య జరగుతుంది.

ప్రారంభ మ్యాచ్‌కు కుమార్ ధర్మసేన, వేన్ నైట్స్ అంపైర్లుగా వ్యవహరిస్తారు. ఫిబ్రవరి 7న మధ్యాహ్నం జరిగే మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు వెస్టిండీస్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్‌కు నితిన్ మీనన్, సామ్ నోగాజ్స్కీ ఆన్–ఫీల్డ్ అంపైర్లుగా ఉంటారు. ఫిబ్రవరి 7 సాయంత్రం ఇండియా, యూఎస్ఏ మ్యాచ్‌కు రాడ్ టక్కర్, పాల్ రీఫెల్ మైదానంలో ఉంటారు. సూపర్ 8.. నాకౌట్ మ్యాచ్ లకు అధికారులను తరువాత ప్రకటిస్తారు. గ్రూప్ దశల్లో నలుగురు భారతీయులు అధికారులుగా వ్యవహరిస్తారు. జవగల్ శ్రీనాథ్, నితిన్ మీనన్, జయరామన్ మదనగోపాల్, కెఎన్ఎ పద్మనాభన్ ఈ లిస్ట్ లో ఉన్నారు. ఆసిఫ్ యాకూబ్, అహ్సన్ రజా అనే ఇద్దరు పాకిస్తానీ అంపైర్లు కూడా ఉన్నారు. బంగ్లాదేశ్ నుండి షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్ ఎంపికవ్వడం విశేషం. డీన్ కాస్కర్, డేవిడ్ గిల్బర్ట్, రంజన్ మదుగల్లె, ఆండ్రూ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగల్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరిస్తారు. ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి.

రోలాండ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార్ ధర్మసేన, క్రిస్ గఫానీ, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేన్ నైట్స్, డోనోవన్ కోచ్, జయరామన్ మదనగోపాల్, నితిన్ మీనన్, సామ్ నొగాజ్స్కీ, కెఎన్ఎ పద్మనాభన్, అల్లావుద్దీన్ రెఫెజర్, లె పాల్ రెఫెజర్, ఎ పాల్ రీఫ్‌సన్ పాలేకర్, లాంగ్టన్ రుసెరే, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, ఆసిఫ్ యాకూబ్.

# బీసీసీఐకి బవుమా సలహా.. టీమిండియా హెడ్ కోచ్‌గా అతడినే ఉంచాలంటూ కామెంట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా హెడ్ కోచ్ గా గౌతమ్ గంభీర్ అడుగుపెట్టినప్పటి దగ్గర నుంచి భారత జట్టు ఖాతాలో ఊహించని చెత్త రికార్డులు వచ్చి చేరుతున్నాయి. టీ20 ఫార్మాట్ మినహాయిస్తే మిగిలిన వన్డే, టెస్టుల్లో భారత జట్టు స్థాయికి తగ్గ ఆట తీరును ప్రదర్శించడంలో విఫలమవుతోంది. స్టార్ ప్లేయర్స్ ఉన్నప్పటికీ జట్టు విజయాలు సాధించడంలో తడబడుతోంది. స్వదేశంలో తిరుగులేని టీమిండియా అనూహ్యంగా మన గడ్డపై విజయాలు కోసం శ్రమిస్తోంది. ముఖ్యంగా టెస్టుల్లో మన జట్టు చివరి రెండేళ్లలో సొంతగడ్డపై రెండుసార్లు క్లీన్ స్వీప్ అయ్యారు. అయితే టీమిండియా హెడ్ కోచ్ కు సౌతాఫ్రికా టెస్ట్ కెప్టెన్ టెంబా బవుమా సపోర్ట్ గా నిలిచాడు.

ఈఎస్పీయన్ క్రిక్ ఇన్ఫో తో మాట్లాడుతూ బవుమా గంభీర్ కు మద్దతుగా మాట్లాడాడు. టీమిండియా టెస్ట్ క్రికెట్ లో పరివర్తన దశలో ఉందని.. గంభీర్ కు కొంచెం సమయం కావాలని బీసీసీఐకి సూచించాడు. “వన్డేల్లో ఇండియాకు దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఉన్నారు. వీరు జట్టును ఎలా ముందుకు తీసుకెళ్తున్నారా మనకి తెలుసు. టెస్ట్ ఫార్మాట్ కు వస్తే ఈ ఇద్దరు టాప్ ప్లేయర్స్ జట్టు ఎంపికకు అందుబాటులో లేరు. ప్రస్తుతం ఇండియా రెడ్ బాల్ క్రికెట్ లో పరివర్తనం చెందుతున్న జట్టు. భారత కోచ్ గౌతమ్ గంభీర్ భుజాలపై చాలా ఒత్తిడి ఉంది. అతనికి ఇదొక ఛాలెంజ్ సిరీస్. గంభీర్ రెడ్–బాల్ ఫార్మాట్ లో ఒక కొత్త మార్గాన్ని కనుగొనాల్సి ఉంది. వన్డేల్లో కోహ్లీ, రోహిత్ సహజంగానే తమ ప్రదర్శనలతో, నాయకత్వంతో జట్టును ముందుకు తీసుకెళ్తారు. టెస్ట్ క్రికెట్ లో భారత జట్టుకు త్వరలో కష్టంగా ఉండొచ్చు.



గంభీర్ స్థానం మారదని నేను భావిస్తున్నాను“. అని బవుమా అన్నాడు. గౌతమ్ గంభీర్ జూలై 2024లో టీమిండియా ప్రధాన కోచ్ అయ్యాడు. ఈ 18 నెలల్లో 2025 లో ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్.. 2025లో ఆసియా కప్‌లో టైటిల్ విజయాలు తప్పితే గంభీర్ ఖాతాలో చెప్పుదగ్గ విశేషాలు ఏమీ లేవు. అయితే పరాజయాలు చాలానే ఉన్నాయి. కోచ్ పదవి చేపట్టిన తర్వాత భారత జట్టు ఈ 18 నెలల్లో 9 చెత్త రికార్డ్స్ నమోదు చేసింది. జట్టు ఓటమికి గంభీర్ ప్రయోగాలే కారణమని కొందరు అంటుంటే.. మరికొందరు ఏమో గంభీర్ వచ్చిన దగ్గర నుంచి డ్రెస్సింగ్ రూమ్ లో వాతావరం బాగా లేదని చెబుతున్నారు. కారణాలు ఏవైనా గంభీర్ కు బ్యాడ్ లక్ మాత్రం కొనసాగుతోంది.

## ప్లే ఆఫ్స్ ఆడకుండా RCB ఫైనల్‌కు.. WPL రూల్స్ ఎలా ఉన్నాయంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆడిన 8 మ్యాచ్ ల్లో 6 మ్యాచ్ లు గెలిచి టేబుల్ టాపర్ గా నిలిచింది. టేబుల్ టాపర్ గా నిలిచిన ఆర్సీబీ నేరుగా ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం (జనవరి 29) జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచి తుది సమరానికి అర్హత సాధించింది. మిగిలిన మ్యాచ్ లతో సంబంధం లేకుండా ఈ సీజన్ లో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్సీబీ ప్లే ఆఫ్ ఆడకుండా ఫైనల్ కు చేరుకోవడం వెనుక కారణం ఉంది. అసలు ఆ రూల్స్ ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం..



డబ్ల్యూపీఎల్ మొత్తం ఐదు జట్లు ఆడుతున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్ మహిళా ప్రీమియర్ లీగ్ ఆడుతున్నాయి. 2023లో ప్రారంభమైన మహిళా ఐపీఎల్..ప్రస్తుతం నాలుగో సీజన్ ముగింపు దశకు వచ్చింది. నాలుగు సీజన్ ల పాటు ఐదు జట్లు ఆడాయి. ఈ లీగ్ రూల్స్ ప్రకారం రౌండ్ రాబిన్ తరహాలో ఒక్కో జట్టు మిగిలిన జట్టుతో రెండు మ్యాచ్ లు ఆడుతుంది. టేబుల్ టాపర్ గా నిలిచిన జట్టు ఫైనల్లో అడుగు పెడుతుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడతాయి. చివరి రెండు స్థానాల్లో ఉన్న జట్లు గ్రూప్ దశలో నిష్క్రమిస్తాయి. రూల్స్ ప్రకారం ఈ సీజన్ లో టేబుల్ టాపర్ గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫైనల్ కు అర్హత సాధించింది.ఈ మ్యాచ్ విషయానికి వస్తే ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఛేజింగ్‌లో గ్రేస్ హారిస్ (37 బాల్స్‌లో 13 ఫోర్లు, 2 సిక్సలతో 75), స్మృతి మంధాన (27 బాల్స్‌లో 8 ఫోర్లు, 2 సిక్సలతో 54 నాటౌట్) దంచికొట్టడంతో గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. టాస్ ఓడిన యూపీ 20 ఓవర్లలో 143/8 స్కోరు చేసింది. దీప్తి శర్మ (55), మెగ్ లానింగ్ (41) రాణించారు. తర్వాత బెంగళూరు 13.1 ఓవర్లలోనే 147/2 స్కోరు చేసి నెగ్గింది. ఈ ఓటమితో యూపీ ప్లే ఆఫ్ రేస్ నుంచి నిష్క్రమించింది. హారిస్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది.

## ప్రభాస్ ‘ఫౌజీ‘.. హను ప్లాన్ ఎలా ఉంది? రిపీట్ చేస్తారా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లైనప్ లో ప్రస్తుతం విభిన్న జోనర్ సినిమాలు ఉన్న విషయం తెలిసిందే. అందులో ఒకటి ఫౌజీ. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఆ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి కథను సిద్ధం చేశారని టాక్. సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనుండగా.. ఆయన సరసన ఇమాన్వి నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని విశాల్ చంద్రశేఖర్ అందిస్తుండగా.. పాటలను కృష్ణకాంత్ రాస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ తో కలిసి టీ సిరీస్ నిర్మిస్తున్న ఆ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. గత ఏడాది మొదలుపెట్టారు మేకర్స్. అయితే ఇప్పుడు దసరా కానుకగా సినిమాను విడుదల చేయనున్నారని కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇంకా అధికారికంగా ప్రకటన రాకపోయినా.. మేకర్స్ ఇప్పటికే ఫిక్స్ అయ్యారని తెలుస్తోంది. అందుకు తగ్గట్లే అటు షూటింగ్ ను.. ఇటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను



నిర్వహిస్తున్నారని సమాచారం. మరికొన్ని రోజుల్లో రిలీజ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. అదే సమయంలో ప్రభాస్ కు ఫౌజీ ఎలాంటి రిజల్ట్ ఇస్తుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎందుకంటే ప్రభాస్ రీసెంట్ గా ది రాజా సాబ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్ డ్ రెస్పాన్స్ అందుకున్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా.. అనుకున్న స్థాయిలో అందరినీ ఆకట్టుకోలేకపోవడంతో అనేక విమర్శలు వచ్చాయి.. వస్తున్నాయి. దీంతో ఫౌజీతో కమ్ బ్యాక్ ఇవ్వాలని అంతా కోరుకుంటున్నారు. అయితే ప్రభాస్ యాక్టింగ్ విషయంలో అదరగొడతారనే విషయం తెలిసిందే. అందుకే డైరెక్టర్ హనుపై మొత్తం ఆధారపడి ఉంది. నిజానికి ఎమోషన్, గ్రాండ్యూర్ కు పేరుపొందిన హను రాఘవపూడి, ఇప్పటికే పలు సినిమాలతో హిట్స్ అందుకున్నారు. ముఖ్యంగా సీతారామం మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. తన మేకింగ్ అండ్ టేకింగ్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే ఇప్పుడు ఫౌజీ విషయంలో కూడా అదే రిపీట్ చేస్తారని అంతా ఆశిస్తున్నారు. కేవలం సినిమా హిట్ అయ్యేలా చూడడమే కాకుండా.. ప్రభాస్ కెరీర్ లో గుర్తుండిపోయే మూవీ తీస్తారని అంచనా వేస్తున్నారు. అయితే ప్రభాస్ ను ఆయన ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్ ఫుల్ అవతార్ లో చూపించబోతున్నారని సమాచారం. మరి ఫౌజీ చిత్రం ఎలాంటి హిట్ అవుతుందో.. హను ప్లాన్ ఎలా ఉంటుందో.. సక్సెస్ మోడ్ రిపీట్ చేస్తారో లేదో వేచి చూడాలి.

### రుహాని శర్మ: ప్రతి ఫ్రేమ్‌లో గ్రేస్



### మోడరన్ ఫైర్‌తో శాన్వి శ్రీవాస్తవ క్లాసిక్ బ్యూటీ



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965